హైదరాబాద్ వార్త





క్రాంతీ కి దరోహర్ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అశ్విని కుమార్ చౌబే

# దేశ భక్తుడు భగత్‌సింగ్

## కేంద్ర మంత్రి అశ్విని కుమార్ చౌబే

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** వహీదన భగత్ సింగ్ ఒక అపూర్వమైన దేశభక్తుడని కేంద్ర మంత్రి అశ్విని కుమార్ చౌబే కొనియాడారు. శుక్రవారం భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని అంబేద్కర్ ఆడిటోరియంలో శ్రీరాజ్ త్రిపాఠి, శ్రీరాహుల్ ఇంక్విలాబ్ రచించిన క్రాంతీ కి దరోహర్ గ్రంధాన్ని అశ్విని కుమార్ చౌబే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ అందరివాడని, రాబోయే తరాల వారికి ఆయన ఒక స్ఫూర్తి జ్యోతి అని కొనియాడారు. అనంతరం శ్రీ శాంభవి మఠాధిపతి స్వామి ఆనంద్ స్వరూప్ మహారాజ్ మాట్లాడుతూ పటిష్ట భారత దేశం కోసం సనాతన ధర్మాన్ని కాపాడటం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గిన్నీస్ ప్రపంచ రికార్డుల సృష్టికర్త, సేవ టెంపుల్స్ భారత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంకు రవి అయ్యగారి, జి.వి.ఆర్.మురళిలు నిర్వహణ చేయగా మంగళ్ పాండే, భగత్‌సింగ్ కుటుంబసభ్యులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల వారు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** శుక్రవారం ఉదయం ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలైన లోయర్‌ట్యాంక్‌బండ్, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్ తదితర ప్రాంతాలలో భారీగా ట్రాఫిక్ జామ్ అవటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకోవటం, పాఠశాలలు, కాలేజీలు, కొన్ని కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు మూసివేయటంతో గణపతి నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం యధావిధిగా పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు ప్రారంభం కావటం, నిమజ్జనాలు చేసుకుని వాహనాలు తిరిగు ప్రయాణం ఒకవైపు, మరోవైపు నిమజ్జనాలకు దూర ప్రాంతాల నుండి గురువారం ఆలస్యంగా బయల్దేరటంతో శుక్రవారం ఉదయంకి కూడా ఇంకా ట్యాంక్‌బండ్‌కు చేరుకోలేక పోవటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గురువారం రోజంతా డ్యూటీ చేసిన ట్రాఫిక్ సిబ్బంది శుక్రవారం ఉదయం ఎక్కడా కనిపించకపోవటంతో, ట్రాఫిక్‌ను కట్టడి చేసే వారులేక వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాలలో అక్కడక్కడా ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ కిలోమీటర్ల మేర బారులు తీరి భారీగా వాహనాలు ఆగిపోవటంతో వారు కూడా ఏమీ చేయలేక, వాహనదారులకు సమాధానం చెప్పలేక చేతులెత్తేశారు. ఉదయం నుండి ఇదే పరిస్థితి ఉండటంతో వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు మధ్యాహ్నం ట్రాఫిక్ అదుపులోకి వచ్చింది.

# నిమజ్జనం..నిర్విఘ్నం..!

## శుక్రవారం రాత్రి వరకు సాగిన వినాయక విగ్రహాల సందడి.. వ్యర్థాలు తొలగింపు పనుల్లో బల్దియా సిబ్బంది

**హైదరాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** ట్యాంక్‌బండ్‌పై గణేష్ నిమజ్జనోత్సవం నిర్విఘ్నంగా సాగింది. గురువారం ఉదయం నుంచి ప్రారంభమైన గణేష్ నిమజ్జనం శుక్రవారం రాత్రి వరకు కొనసాగింది. గణేష్ మహారాజ్‌కీ జై ..నినాదాలతో ట్యాంక్‌బండ్ పరిసరాలు మార్మోగాయి. నగరం నలుమూలల నుంచి తరలిన వేలాది గణేష్ విగ్రహాలను హుస్సేన్‌సాగర్లో నిమజ్జనం చేశారు. నగరంలోని చాలా ప్రాంతాల నుంచి అర్థరాత్రి తర్వాత విగ్రహాలను నిమజ్జనం కోసం తీసుకురావడంతో ఉదయం పెద్ద సంఖ్యలో విగ్రహాలు సాగరంవైపు కదిలాయి. దీంతో హుస్సేన్‌సాగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో శుక్రవారం కూడా నిమజ్జన సందడి కొనసాగింది. పోలీసులు, ట్రాఫిక్, జలమండలి, ఆర్‌అండ్‌బి, జిహెచ్‌ఎంసి, విద్యుత్ తదితర విభాగాల అధికారులు ఎలాంటి ఆటంకాలు లేకుండా విధులు నిర్వర్తించారు.

గణేశ్ నవరాత్రుల ఉత్సవాలు పూర్తి కావడంతో హుస్సేన్‌సాగర్‌తో పాటు గ్రేటర్ వ్యాప్తంగా వివిధ కొలనుల్లో జరిగిన నిమజ్జనాలతో పేరుకుపోయిన పూజా సామాగ్రి తదితర వ్యర్థాల తొలగింపు పనుల్ని జిహెచ్‌ఎంసి పారిశుధ్య కార్మికులు చేపట్టారు. సచివాలయంతోపాటు ట్యాంక్‌బండ్ చుట్టుపక్కల రహదారులపై పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు జిహెచ్‌ఎంసి సిబ్బంది తొలగించారు. శోభాయాత్ర మార్గాల్లో రోడ్లపై వ్యర్థాల తొలగింపు పనులను ముమ్మరం చేశారు. వీటిని తొలగించాక ఫుట్‌పాత్‌లను నీటితోశుభ్రం చేసే కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం వరకు సుమారు 7,400 మెట్రిక్ టన్నుల వ్యర్థాల్ని జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించినట్లు జిహెచ్‌ఎంసి అధికారులు పేర్కొంటున్నారు. చెత్త తరలింపునకు రెగ్యులర్‌గా వినియోగిస్తున్న వాహనాలతోపాటు అదనంగా వంద వాహనాలను వినియోగించారు.


వినాయకులను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

**నిమజ్జనోత్సవంలో మందుబాబుల పాడు పని..**

నిమజ్జనోత్సవం సందర్భంగా మద్యం అమ్మకాలు బంద్ చేసినా మందు బాబులు మాత్రం వెనక్కి తగ్గలేదు. వైన్స్ బంద్ ఉండడంతో మూడు రోజుల ముందుగానే మద్యాన్ని కొనుగోలుచేసి స్టాక్ పెట్టుకుని మందుబాబులు గణేశ్ ఉత్సవాల్లో చాలా చోట్ల మద్యం సేవించారు. అయితే అదేదో గుట్టు చప్పుడు కాకుండా కాదు..అందరి ముందు పబ్లిక్ గానే నిమజ్జనానికి తరలిస్తున్న వాహనాలపైనే కూర్చొని మద్యం సేవించారు. ఇవి చూసిన భక్తులు ముక్కున వేలేసుకున్నారు. సర్వవిఘ్నాలు తొలగించి విఘ్నేశ్వరుని భక్తిశ్రద్ధలతో పూజించి ఎంతో నిష్టతో పాల్గొనవలసిన నిమజ్జనం కార్యక్రమంలో ఇలా మద్యం సేవించడం ఏంటని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పబ్లిక్‌గానే రోడ్ల మీద బీర్ బాటిల్ చేతిలో పట్టుకొని మద్యం సేవిస్తూ జనాల్లో తిరుగుతుండడంతో అక్కడే ఉన్న మహిళలు పిల్లలు కాస్త ఇబ్బందికి గురైన సంఘటనలు పలుచోట్ల జరిగాయి.

**మెట్రోలో 5లక్షల మంది...**

వినాయక నిమజ్జనం సందర్భంగా గురువారం మూడు మెట్రో మార్గాల్లో ప్రయాణికులు కిటకిటలాడారు.ప్రయాణికుల సంఖ్య సుమారు 5లక్షల మార్కును దాటింది. ఎల్బీనగర్-మియాపూర్ మార్గంలో, నాగోల్-రాయదుర్గం, జేబీఎస్-ఎంజీబీఎస్ మార్గంలో ప్రయాణికుల రద్దీతో రైళ్లు పరుగెత్తాయి. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద ఎంట్రీ 46,834మంది కాగా, ఎగ్జిట్ అయినవారు 50,713 మంది ఉన్నారు.


వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం


నిమజ్జనానంతరం రోడ్లను శుభ్రం చేస్తున్న జిహెచ్‌ఎంసి స్వీపర్

# మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

## గతంలోనూ మూడుసార్లు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన అష్టమైతీ

**బేగంపేట సెప్టెంబరు 29,ప్రభాతవార్త**

మద్యానికి బానిస అయిన ఓ వ్యక్తి తాగేందుకు డబ్బులు లేక పోవడంతో తీవ్ర మనస్థాపానికిగురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహంకాళీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్ లాంగూల్ పారాపోస్ట్, హుగ్లీ జిల్లా కాలింబా గ్రామానికి చెందిన అష్టమైతీ (37) కుటుంబంతో సికింద్రాబాద్ కండోజీబజార్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతను దశరథ్‌మైతీ బంగారు ఆభరణాల దుకాణంలో ఆభరణాల తయారు చేసేవాడు. మద్యానికి బానిసైన అష్టమైతీ ప్రతి రోజు మద్యం తాగేవాడు. 29వ తేదీ ఉదయం నిద్ర నుంచి లేచిన ప్రియాంకమైతీ భర్త గదిలో లేక పోవడాన్ని గుర్తించింది. వెంటనే బాత్రూమ్ వద్దకు వెళ్లి పిలిచింది. లోపలి నుంచి బోల్ట్‌వేసి ఉండటం, ఎలాంటి సమాధానం రాకపోవడంతో కుమారుడిని పిల్చింది. ఇద్దరు కల్సి బాత్రూమ్ డోర్‌ను బలంగా నెట్టారు. లోపల షవర్ హ్యాండిల్‌కు ఆరెంజ్ కలర్ కాటన్ టవల్‌తో మోకాళ్లపై వేలాడుతుండటం గమనించి పెద్దగా కేకలువేయడంతో బంధువు, ఇంటి యజమాని కింకర్‌మైతీ ఇతరుల సహాయంతో అష్టమైతీని కిందికి దించారు. ఈ విషయాన్ని వారు మహంకాళీ పోలీసులకు,108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిక్షించగా అప్పటికే అతను చనిపోయినట్లు నిర్ధారించారు.మృతుని భార్య ప్రియాంక మైతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటున్ల పోలీసులు తెలిపారు.

## ఉప్పల్ స్కైవాక్ నుంచి దూకి

# యువకుడి ఆత్మహత్యాయత్నం

**ఉప్పల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ స్కైవాక్ నుంచి దూకి ఒక వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన శివకుమార్ 22 స్థానికంగా పనిచేస్తున్నాడు. అయితే కొద్ది రోజులుగా అదే ప్రాంతంలో నివసించే ఒక యువతిని ప్రేమిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆమె పెళ్లి చేసుకోవాలని వత్తిడి తీసుకుని రావడంతో మానసిక వత్తిడితో ఉప్పల్ స్కైవాక్ వద్దకు వచ్చి పైకి ఎక్కి కిందకు దూకినట్లు తెలిపారు. శివకుమార్ పరిస్థితి విషయంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలి

## మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం సనత్‌నగర్ డివిజన్‌లో పర్యటించి రూ.2.84 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అనేక అభివృద్ధి పనులను చేపడుతుందన్నారు. పనులు సక్రమంగా జరిగే విధంగా స్థానిక ప్రజలు కొంత పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. గడచిన 60 సంవత్సరాలలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో జరిగిందని, నియోజకవర్గ ప్రజలు అందరికి తెలిసిందేనని అన్నారు. అనేక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ, వాటర్ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. పార్క్‌లను ఎంతో అద్భుతంగా అభివృద్ధిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలను ఒకే రీతిలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఎల్‌ఐజిహెచ్‌లో ఉన్న ఇనుప విద్యుత్ స్థంబాలను తొలగించాలని స్థానికులు మంత్రిని కోరగా, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కార్పోరేటర్ కొలన్ లక్ష్మీ, డిసి జగన్, ఈఈ ఇందిర, ఎలక్ట్రికల్ డిఈ అమర్‌నాథ్, వాటర్ వర్క్స్ జిఎం హరి శంకర్, హార్టికల్చర్ డిడి శ్రీనివాస్, ఎఎంఒహెచ్ భార్గవ్, డివిజన్ బిఆర్ఎస్ కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్, సురేష్‌గౌడ్, సరాఫ్ సంతోష్, విజయ్‌సింగ్, రాజేష్ ముదిరాజ్, పురుషోత్తం, సీనియర్ సిటీజన్ కౌన్సిల్ సభ్యులు సహదేవ్‌గౌడ్, సమి ఉల్ల తదితరులు పాల్గొన్నారు.


పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తలసాని


రేవంత్‌రెడ్డితో ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌రాజు తదితరులు

# కాంగ్రెస్‌లో చేరిన జడ్పీ మాజీ వైస్‌చైర్మన్, పిఎసిఎస్ చైర్మన్

**దుండిగల్, కొంపల్లి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, దూలపల్లి పిఎసిఎస్ చైర్మన్ నరేందర్‌రాజు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో పిసిసి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు.ప్రభాకర్‌రెడ్డి, నరేందర్ రాజు మాట్లాడుతూ పేదల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలనతో దోచుకుతింటున్నారని, బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్ళి కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఇక అరాచకపు పాలనకు స్వస్తి చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంలో అపశృతి

## రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

**హైదరాబాద్, సెప్టెంబరు 29,ప్రభాతవార్త:** గణేష్ నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. సంజీవయ్య పార్కువద్ద ఓ వ్యక్తి లారీకింద పడి చనిపోయాడు. గణేష్ విగ్రహం నిమజ్జనం చేయడానికి వచ్చిన వ్యక్తి లారీ కిందపడి చనిపోయాడు. మృతుడు కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన ప్రణీత్‌గా పోలీసులు గుర్తించారు. ఈఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ డెడ్‌బాడీని సికింద్రాబాద్‌లోని మార్చురీకి తరలించారు. సిద్ది వినాయక యూత్ అసోసియేషన్ వెంట నిమజ్జనానికి వెళ్ళిన ప్రణీత్ ప్రమాదవశాత్తు లారీ కిందపడి చనిపోయాడు.

**మరో ప్రమాదంలో బాలుడు మృతి ..**

మరోప్రమాదంలో నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ సమీపంలో లారీ టైర్‌కింద పడి ఆయుష్ మృతి చెందాడు. సంతోష్‌నగర్ ప్రెస్‌కాలనీలో నివాసం ఉంటున్న రాజశేఖర్ అనే వ్యక్తి తనకుటుంబంతో కలిసి గణేష్ నిమజ్జనం చేయడానికి బైక్‌పై వెళ్తుండగా వాహనం స్కిడ్ కావడంతో కిందపడిపోయారు. దీంతో బైక్‌పై నుంచి కిందపడ్డ ఆయుష్‌పైనుంచి టస్కర్ వాహనం వెళ్లింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాబును నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ ఆయుష్‌చనిపోయాడు.

# కుప్పిగంతుల మల్కాజిగిరి

## నేతలు స్థాయిని బట్టి ప్యాకేజీ అంటూ విస్తృత ప్రచారం

**అల్వాల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** మల్కాజిగిరి తెలుగు రాష్ట్రాలలో ఆసక్తిని రేకెత్తిస్తున్న పేరు. అధికార పార్టీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు రాజీనామా చేసిన నాటికి ఈ పేరు తెలియని వారు లేరనే చెప్పాలి. రెండు టిక్కెట్ల విషయంలో ఎమ్మెల్యే మంత్రి హరీశ్‌రావుపై చేసిన కామెంట్లతో ఒక్కసారిగా అందిరి చూపు ఈ నియోజకవర్గంపై పడింది. వివాదం ప్రారంభమైన నాటి నుంచి మైనంపల్లి బిఆర్ఎస్‌లో దోబూచులాటలు కొద్ది కాలం సాగాయి. ఎవరు తగ్గుతారు ? ఎవరు నెగ్గుతారు ? అనే కోణంలో ప్రజానీకం ఆసక్తిగా ఎదురు చూశారు. పార్టీ నుంచి సానుకూల సంకేతాలు లేని కారణంతో ఎమ్మెల్యే పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పంచన చేరారు. ఇక్కడి నుంచే అసలైన ముఖచిత్రం కనపడడం ప్రారంభమైంది. ఎమ్మెల్యేపై అసంతృప్తితో సమయంకోసం వేచి చూసినవారు అంతా నేడు ఎలుకలు కలుగులు నుంచి బయటకి వచ్చిన చందంగా బాహ్య ప్రపంచంలోకి రావడం జరుగుతోంది. బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, క్యాడర్ తలో దిక్కుకు వెళ్లడం ప్రారంభమైంది. అధిక శాతం కార్పొరేటర్లు తమ బాస్‌ను కాదని గులాబీ దళంలోనే కొనసాగడానికి అనేక కారణాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. మైనంపల్లికి అత్యంత సన్నిహితులుగా మెలిగిన అధిక శాతం కార్పొరేటర్లు మోహం చాటేయడం ఇక్కడ కొసమెరుపు. సిట్టింగులను కాదని అనుచరులకు కార్పొరేటర్ టిక్కెట్లు ఎమ్మెల్యే ఇప్పించారు. ఇటువంటివారే ప్రధానంగా నేడు ఆయనకు హ్యాండ్ ఇవ్వడం జరిగింది. మైనంపల్లి వెంట ఉంటే స్వేచ్ఛ ఉండదని రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడం కష్టమనే భావన వారిలో ఉంది. పార్టీని వీడితే వ్యాపారాలు, కేసులు ఉంటాయనే భయం వెంటాడుతోంది.మైనంపల్లి హనుమంత రావు వెన్నంటి ఉన్నంత కాలం ఆర్థికంగా ఎదగలేక పోయామనేది కూడా ప్రధానంగా వినిపిస్తున్న వాదన. ఎమ్మెల్యేపై ఉన్న భయం, భక్తితో కార్పొరేటర్లు, క్యాడర్ ఎక్కడా వ్యాపారస్తు లను, ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది లేదనే చెప్పాలి. మహా నగరంలో ఏ నిర్మాణం జరిగినా ముందుగా ఆయా ప్రాంతాలలోని కార్పొరేటర్లు కిందిస్థాయి క్యాడర్‌ను కలవకుండా పనులు జరిగే పరిస్థితి లేదనేది జగమెరిగిన సత్యం. మల్కాజిగిరిలో మాత్రం ఇందుకు పూర్తి విరుద్దంగా ఇప్పటివరకు సాగింది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు ఎవరూ ప్రజలను ఎట్టి పరిస్థితిలోనూ ఇబ్బందులు పెట్టవద్దన్నది మైనంపల్లి ఆదేశంగా ఉండేది. ఇంటి నిర్మాణాలు, వ్యాపారులు వద్దకు క్యాడర్ వెళ్లి డిమాండ్ చేయడం నియెజవర్గంలో చాలా తక్కు వనే చెప్పాలి. మంచికో చెడుకో ఎమ్మెల్యే చేసిన ఈ కట్టడి ఆయనకు నేడు చెడుగా మారింది. నాలుగున్నర ఏళ్ల కాలంలో ఎమ్మెల్యే నుంచి ఎటువంటి ప్రయోజనం పొందలేదని వారు బహిరంగంగగా చెబుతు న్నారు. మల్కాజిగిరి బిఆర్ఎస్ బరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డి వంద శాతం ఉండనున్న నేపథ్యంలో ఆయనపై ప్రజాప్రతిధులు, కింది స్థాయి క్యాడర్ ఆశలు పెట్టుకుని ఉన్నారు. మర్రి రంగంలోకి వచ్చిన నాటి నుంచి వారిలో వెలుగు కనపడుతోంది. ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో మద్దతుగా ఉంటామని తమ డిమాండ్ ఇది అని స్పష్టం గా చెబుతున్నారు. ఇంత కాలం పార్టీ కార్యకలాపాలు కోసం సొంత డబ్బు ఖర్చు పెట్టామని లక్ష్మీకటాక్షం ఉంటేనే పనిచేస్తామని ఇన్ని రోజులు ఇలా నష్టపోయామని కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు. మైనంపల్లిని కాదని పార్టీలో కొనసాగితే నేత, కార్యకర్తల స్థాయినిబట్టి ప్యాకేజీ ఇంత అనే ప్రచారం జరుగుతుండగా ఇది ఎంతవరకు వాస్తవం అనేది భవిష్యత్తులో తేలనున్నది. ఇదంతా ఒట్టి ప్రచారమని కొట్టిపారేస్తున్న వారు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికలు అంటేనే ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉన్న అంశం. అధికారం పార్టీని వదిలి ప్రతిపక్షంలోకి వెళ్ళిన నాయకుడి వెంట నడవడానికి అధిక శాతం నేతలు ఉత్సాహం చూపరనేది వాస్తవం. తమ అధికార దర్పం కొనసాగాలనే ఆకాంక్ష వారిలో ఉంటుంది. ఎమ్మెల్యే మరో రెండు రోజులులో ఢిల్లీ నుంచి వచ్చి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. వారం రోజులుగా స్థానిక క్యాడర్‌కు అందుబాటులో లేని నేపథ్యంలో రకరకాలు ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఎమ్మెల్యే నేరుగా క్యాడర్‌తో టచ్‌లోకి వచ్చిన తరువాత కుప్పిగంతులపై వాస్తవ పరిస్థితులు తెరపైకి వస్తాయి.



మల్కాజిగిరి రైల్వే స్టేషన్(ఫైల్‌ఫొటో)





పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న అబిడ్స్ ఎసిపి చంద్రశేఖర్

### ప్రశాంతంగా నిమజ్జనోత్సవం
## సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఎసిపి, సిఐ

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రశాంత వాతావరణంలో సామూహిక వినాయక నిమ్జనోత్సవానికి ప్రజలు పోలీసులకు సహకరించినందుకుగాను అబిడ్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ప్రత్యేక కృజ్ఞతలు తెలిపారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా అభినందించారు. శాంతి భద్రతలను కాపాడేందుకు గాను అన్నివర్గాల ప్రజలు పోలీసులకు సహకరించడం పట్ల అబిడ్స్ సిఐ టి.నర్సింహరాజు ప్రత్యేక కృతజ్ఞత తెలిపారు.

### నిమజ్జనానికి సహకరించినవారికి సుల్తాన్‌బజార్ ఎసిపి కృతజ్ఞతలు

**బేగంబజార్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకుగాను పోలీసులకు ప్రజలు సహకరించడం అభినందనీయమని సుల్తాన్‌బజార్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు బాలగంగిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులు గా నగరపోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ ఆద్వర్యంలో నగర పోలీసులు రాత్రి పగలు శ్రమించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా తగ్గిన చర్యలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందో బస్తును ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరిపించడంలో పోలీసులు విజయం సాధించమన్నారు.

## భజరంగ్ సేన ఆధ్వర్యంలో శోభాయాత్ర


శోభయాత్రలో పాల్గొన్న భజరంగ్‌సేనా అధ్యక్షులు లక్ష్మన్‌రావుగుప్త

**బేగంబజార్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** వినాయక చవితి పురస్కరించుకుని తెలంగాణ భజరంగ్ సేన ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన శోభయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త, ప్రధాన కార్యదర్శి సూర్యశుక్లా, యూత్ అధ్యక్షులు వినిత్‌యాదవ్, మనోజ్, శ్రీనివాస్‌గుప్త, నరేష్, శంకర్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

## పులిహోర, వాటర్ ప్యాకెట్లు పంపిణీ

**బేగంబజార్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడూ వేదికను ఏర్పాటు చేసి భక్తులకు పులిహోరా, వాటర్ ప్యాకెట్లు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాస్ అద్యక్షులు క్యాతం రాధాకృష్ణ,(రాజు), ప్రధాన కార్యదర్శి విజయ్‌బాస్కర్, కోశాధికారి రాకేష్, హార ్ఎన్ చిన్నారులు వినాయక, అయ్యప్ప భక్తి గీతాలను ఆలపించారు.

## వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీఆంజనేయ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు శుక్రవారం ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మసూర్యప్రకాశ్, ఈవో దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో జరిగింది. హుండి లెక్కించగా రూ.2,16,632 ఆదాయం వచ్చిందని ఈ సందర్భంగా ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయం ధర్మకర్తలు మురికి గణేష్, అర్చకులు బుగ్గా లక్షీపతిశర్మ, కె.వెంకటాద్రి, ఆచారి, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉమామహేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో జరుగుతున్న నవరాత్రోత్సవాల సందర్భంగా ఉమా మహేశ్వరస్వామివారి కళ్యాణ మహోత్సవం ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా సాగింది. ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కాశీనాథ్‌శర్మ, గోపాలాచార్యులు, భవానీఆచార్యులు, రామాచార్యులు, జగన్మోహనాచార్యులు, పూర్వ చైర్మన్ బిఎన్.శ్రీనివాస్‌రావుయాదవ్, ధర్మకర్తలు ఎఎస్‌వి.రమణమూర్తి, సి.వెంకటగోవిందరావు, ఓ.మోహన్‌రావు, డాక్టర్ ఎన్.వెంకటరమణారావు, పి.అరుణశ్రీ, కె.స్వరూప, బి.శివకుమారి, సిహెచ్.రాజాశ్రీనివాస్, ఎ.దశరథ్, కె.హనుమంతరావు, కె.రాజు, జానకీ సురేఖ, భక్త బృందం సభ్యుడు జి.గజానంద్, మణి, రామ్మూర్తి, ఆలయం సిబ్బంది రాజు, రాజన్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం స్వామివారికి సుప్రభాతం, బిందెతీర్థం అనంతరం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి హోమం, పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక లలిత, విష్ణు సహస్ర నామ పారాయణోత్సవాలు నిర్వహించారు. అంతకుముందు అనంతపద్మనాభ స్వామి వ్రతమహోత్సవాలను శాస్త్రోక్తంగా జరిగాయి.

## లక్ష్మీగణపతి ఆలయం లడ్డూ వేలం
### రూ.1లక్ష55వేలకు కైవసం చేసుకున్న రామ్మూర్తి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ వేలంలో 27కిలోల లడ్డును కైవసం చేసుకున్న రామ్మూర్తి దంపతులను ఆర్టీసి క్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి ఆలయంలో ఘనంగా సత్కరించి అభినందించారు. లడ్డూవేలంలో ఆలయం భక్త బృందం సభ్యుడు సి.రామ్మూర్తి 1లక్ష55వేలకు గెలుచుకున్న విషయం తెలిసిందే. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. తాను లడ్డూ గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, గత కొన్ని పర్యాయాలు తాను లడ్డూ కైవసం చేసుకోవడానికి ప్రయత్నాలు చేశానని, ఎలాగైనా సాధించాలనుకున్నానని గణనాధుడి కృపాకటాక్షాలతో కైవసం చేసుకోవడం జరిగిందని రామ్మూర్తి అన్నారు. ఇప్పటివరకు జరిగిన లడ్డూ వేలంలో ఆలయం మాజీ చైర్మన్ బిఎన్.శ్రీనివాస్‌రావు యాదవ్ 2016లో 1లక్ష06వేల రూపాయలకు, 2017లో 1లక్ష10వేల రూపాయలకు, తిరిగి 2021లో రూ.74వేలకు గెలుచుకున్నారు. 2019లో జరిగే వేలంలో రూ.లక్ష29,500 ఆలయం భక్త బృందం సభ్యుడు, ప్రస్తుతం ఆలయం ధర్మకర్త ఏఎస్‌వి. రమణమూర్తి గెలుచుకోగా, 2022లో ధరణి శ్రీధర్ గెలుచుకున్నారు. లడ్డూ గెలుచుకున్న రామ్మూర్తి కుటుంబ సభ్యులైన సి.లత, సి.వినయకుమార్, రజనీలను సత్కరించి అభినందించారు.


వేలంలో లడ్డూ గెలుచుకున్న రామమూర్తిని సత్కరించిన దృశ్యం

# ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం

### బేడ బుడగ సంఘం ప్రతినిధులు

**తార్నాక, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** బేడ బుడగ జంగాల కులస్తులు ఐక్యంగా ఉంటేనే అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత నిస్తాయని హిందూ విద్యాసంస్థల చైర్మన్ రేపాక ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. ఓ.యూలో బేడ బుడగ జంగాల పోరాట సమితి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ బుడగ జంగాల కులస్థులకు సరైన గుర్తింపు నివ్వకపోవడం ధారుణం అన్నారు. పార్టీలు గుర్తింపు నివ్వాలంటే అందరు ఐక్యమత్యంతో పోరాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తెలంగాణ బేడ బుడగ జంగాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గిరి పర్వతం మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగల తరువాత అత్యధిక జనాభా ఉన్న తమ బుడగ సంఘాలను గుర్తించి చట్టసభల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బుడగజంగాలకు తగిన ప్రాధాన్యత నివ్వ


ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట జెండాను ఆవిష్కరిస్తున్న బేడ బుడగ సంఘం ప్రతినిధులు

కుంటే ఒక నియోజక వర్గాన్ని ఎంచుకొని అక్కడ వంద మందికి పైగా బేడ బుడగ జంగాలము వారి పై పోటీ చేస్తామని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అన్ని రాజకీయ పార్టీలు తమకు సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగాల రాష్ట్ర ఉపాధ్యక్షులు పాస్తం శ్రీనివాస్, ప్రధన కార్యదర్శి కల్లెం వెంకటేష్, భువనగిరి జిల్లా అధ్యక్షులు కల్లెం ముత్తు, యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పాటి నరసింహ, బిజెపీ నాయకులు దేవుడు కుమార్, పలువురు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

## రూ.5 కోట్లతో అభివృద్ధి పనలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**కొంపల్లి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** కొంపల్లి మున్సిపాలిటిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వివేకానంద్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని వివిధవార్డులలో రూ. 5 కోట్ల 12లక్షలతో చేపట్టనున్న సిసిరోడ్లు, బిటిరోడ్డు, స్ట్రోమ్‌వాటర్ ఆర్‌సిసి పైపులైన్, సెప్టిక్‌ట్యాంక్, కమ్యూనిటీహాల్, ఓపెన్‌జిమ్, బస్తీదవాఖాణ, ధోబీఘాట్‌ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీశైలంయాదవ్, వైస్‌చైర్మన్ గంగయ్యానాయక్, కమీషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, ఏఈ ప్రవీణ్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నేడు 'ఎరుకల ఆత్మగౌరవ జెండా పండగ'

**సైఫాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఎరుకుల జాతిని బిసి జాబితా నుంచి ఎస్టీ జాబితాలోకి చేర్చిన దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీ శనివారం ఎరుకల అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ 'ఎరుకల ఆత్మగౌరవ జెండాపండుగ'ను ఘనంగా నిర్వహించుకోవాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం సంయుక్త కార్యదర్శి బి.రఘు ఎరుకల జాతికి పిలుపునిచ్చారు. ప్రతి జిల్లా, గ్రామంలో గురుశిష్యుల అనుబంధాన్ని చాటిచెప్పె ఏకలవ్య విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని, అలాగే ఎరుకల జాతి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన అమరుల త్యాగాలను స్మరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం స్థాపించిన నాటి నుంచి నేటివరకు సంఘం నాయకులు ఎరుకల జాతిని అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని, ఇంకా చేస్తున్నారని, ఎన్నో విజయాలను సాదించారని చెప్పారు. ప్రతి ఏడాది ఎరుకల సంఘం అధ్యక్షుడు కుతాడి కుమార్, రాష్ట్ర కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఈ జెండా పండుగలు జరుగుతున్నాయని చెప్పారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. అడ్డగుట్ట సీ సెక్షన్ ప్రాంతానికి చెందిన రెండు సంవత్సరాల ఓం ఇంద్రన్ష్ గుండె సంబంధిత వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ దృష్టికి తీసుకెళ్ళారు. వెంకటనే స్పందించిన ఆయన బాలుడి చికిత్స నిమిత్తం రూ. 1లక్ష మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను శుక్రవారం కార్పొరేటర్ చేతుల మీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యాక్రమంలో లింగాని శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

## గణనాథుడిని దర్శించుకున్న విశాల్‌గౌడ్

**పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కెపి.విశాల్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీపంచముఖీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూను రూ.95వేలకు కైవసం చేసుకున్న నార్ల కంటి విష్ణుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

**రూ. 1లక్ష21వేలు పలికిన రాఘవేంద్రకాలనీ లడ్డూ..**

జీడిమెట్ల డివిజన్ పరిధిలోని హెచ్ఎఎల్‌రాఘవేంద్రకాలనీలో గణనాథుని లడ్డూను వేలంపాటలో రూ,1లక్షా21వేలకు బసంత్‌లాల్ సొంతం చేసుకున్నారు. చిన్నలడ్డూను రూ,71వేలకు అల్లే కిషన్ దక్కించుకున్నారు. ఉత్సవ కమిటి సభ్యులు వారికి శుభాకాంక్షలు తెలుపుతూ సత్కరించి లడ్డూను అందజేశారు.

## లంబోదరుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి : కార్పొరేటర్

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** లంబోదరుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని డివిజన్ కార్పోరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు పేర్కొన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలో రామకృష్ణ నగర్‌లో ఏర్పాటు చేసినటువంటి వినాయక మండపానికి మాధవరం రోజాదేవి రంగారావు శుక్రవారం సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలపై వినాయకుడి ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాచర్ల భద్రయ్య, నాయకులు మోజేష్, డివిజన్ అధ్యక్షులు కె.మధు పాల్గొన్నారు.

### నిమజ్జన వేడుకల్లో పాల్గొని నృత్యాలు చేసిన వడ్డేపల్లి..

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో తొమ్మిది రోజులుగా వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు ప్రాంతాల్లో జరిగిన నిమజ్జన వేడుకల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు. కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీనగర్, మూసాపేట్, బోయిన్‌పల్లి డివిజన్‌లలో గల మండపాలను సందర్శించడంతో పాటు నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద నిమజ్జనం సందర్భంగా కమిటీ సభ్యులతో కలిసి నృత్యాలు చేశారు. వినాయక నవరాత్రి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలందరికీ వినాయకుడు శుభాశీస్సులు అందించి వారు వచ్చే సంవత్సరం వరకు సుఖసంతోషాలతో ఉండాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు భగవంతున్ని కోరుకున్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిక్షమయ్యగౌడ్, నర్సాగౌడ్, సిద్దిరాములుగౌడ్

## గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి
### -మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 29,ప్రభాతవార్త:** గౌడకులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్ అన్నారు. ఈమేరకు శుక్రవారం గౌడ జనహక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్3న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే గౌడ జనగర్జన పోస్టర్‌ను జాతీయ అధ్యక్షులు నర్సాగౌడ్, సెక్రటరీ జనరల్ రాగుల సిద్దిరాములుగౌడ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా బిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గౌడకులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని కులవృత్తులను ప్రోత్సహించే చట్టాలను రూపొందిస్తున్నామన్నారు. గౌడకులస్తులు ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు పోరాడాలని ఐక్య ఉద్యమాలద్వారానే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాల్‌రాజ్‌గౌడ్, ఉపాధ్యక్షులు ముత్యం నర్సింహులు, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాగుల కిరణ్‌గౌడ్, మోత్కురు సంజీవ్‌గౌడ్‌లతో పాటు పలువురు గౌడకులస్తులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో దాదాపు 3కోట్ల రూపాయలతో కూడిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించేందుకు కోట్లాది రూపాయల నిధులతో అన్ని డివిజన్లను అభివృద్ధి పరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, డిఈ బాలకృష్ణ, ఏఈ శివప్రకాష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ సూర్య, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు, గడిల ప్రభాకర్‌రావు, యాదగిరి, నర్సిమ, సాయిగౌడ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వెంటనే ఇవ్వాలి

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** అర్హత కలిగిన తమకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే అందజేయాలని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం మారేడ్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయం వద్ద శక్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్ ముదిరాజ్ అధ్యర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ బాధితులు ఆందోళ చేశారు. గత ఆరు సంవత్సరాల కిందట తాము నివాసం ఉంటున్న ఇండ్లను ఖాళీ చేయించి నూతన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించిన ప్రభుత్వం తమకు ఇవ్వకపోవడంతో తాము కిరాయి ఇండ్లల్లో ఉంటు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇండ్ల నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా తమకు కేటాయించడం లేదని తెలిపారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చర్యలు తీసుకొని నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించాలని కోరారు. తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని బాధితులు స్పష్టం చేశారు. ఈ కార్యాక్రమంలో రాజ్‌గోపాల్, మహేందర్‌రెడ్డి, రఘు, శ్రీను, బషీర్, లక్ష్మీ, లావణ్య, చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకోసం ఆందోళన జరుపుతున్న దృశ్యం

# ప్రభుత్వ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి: బిజెపి

**నిజాంపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** బాచుపల్లి మండలం నిజాంపేటలోని సర్వేనంబర్ 96లో కబ్జాలపై చర్యలు తీసుకోవాలని బిజెపి మున్సిపల్ అధ్యక్షులు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సర్వేనంబర్ 96లో 24గుంటల ప్రభుత్వం స్థలం ఉందన్నారు. గతంలో ఈ స్థలంలో ఏలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే భాజపా ఫిర్యాదుమేరకు నాటి తహాసీల్దార్ కబ్జాలను తొలగించి బోర్డును ఏర్పాటు చేశారు. నెల రోజులుగా బోర్డును తొలగించి మళ్ళీ ఆక్రమణలు చేపట్టి ప్రహారీలు నిర్మించారు. అనుమతులు నిర్మాణాలకు ప్రారంభమైన రెవిన్యూ, మున్సిపల్ యంత్రాంగం ఎందుకు చర్యలు


కబ్జాను వివరిస్తున్న భాజపా నాయకులు

చేపట్టడం లేదని ప్రశ్నించారు.

రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళ్ళడం రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలుస్తుందన్నారు. జివో 59ను అడ్డం పెట్టుకొని అడ్డదారిలో క్రమబద్దీకరించారనే అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలం కబ్జాపై చర్యలు చేపట్టిన యెడల న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రజావ సరాలకు అనుగుణంగా స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెవైఎం అధ్యక్షులు సాయి కృష్ణారెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షులు అశోక్‌నాయక్, కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


మహాకాళీ అమ్మ వారి ఆలయంలో నిర్వహించిన చండీహోమం

## శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో చండీహోమం

**బేగంపేట సెప్టెంబరు 29,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకొని చండీ హోమం నిర్వహించారు. ఈ హోమం పూజా కార్యక్రమానికి వంద మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మ వారి ఆశీస్సులు పొందారు. ఈ హోమం పూజా కార్యక్రమంలో దేవస్థానం ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి, ఛైర్మన్ రామేశ్వర్ ట్రస్ట్‌బోర్డు మెంబర్స్ భక్తులు పాల్గొన్నారు.

**నేడు ఆలయం హుండీ లెక్కింపు**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో శనివారం ఉదయం 9 గంటలకు ఈఓ, చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని ఈఓ తెలియజేసారు.

## ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ప్రముఖపారిశ్రామికవేత్త రాచూరి విక్రమ్‌సింహ అన్నారు. శుక్రవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతిదేవాలయంలో ప్రతినిత్యం ఏర్పాటు చేసే అన్న సమారాధన కార్యక్రమంలో భాగంగా రాచూరి విక్రమ్ సింహ కుటుంబ సభ్యులు రాచూరి రమాదేవి, రాచూరి పవిత్ర, రాచూరి వన్ష్‌విశ్వక్ సింహ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని విక్రమ్ సింహ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, ఈఓ లక్ష్మారెడ్డి, ఆలయం పూర్వ చైర్మన్ బిఎన్.శ్రీనివాస్‌రావు యాదవ్, ధర్మకర్త రమణమూర్తి, భక్తబృందం సభ్యులు గజానంద్, మణి, గుండ్ల గజానంద్, గౌరారం శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

## జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీలో సీట్లు కేటాయించాలి
### -గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్

**చిక్కడపల్లి సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గౌడ జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీలో సీట్లు కేటాయించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ అవతరణకు ముందు, 2004 సంవత్సరంలో కల్లుగీత వృత్తి నిషేదించబడిన నాటి నుంచి 2014 రాష్ట్ర సాధించిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో అనేక విజయాలు సాధించడం జరిగిందని, అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు తమతమ మానిఫెస్టోల్లో గౌడ సామాజికవర్గానికి అత్యధికంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీట్లుకేటాయించడంతో పాటు బడ్జెట్‌లో నిధులను అత్యధికంగా కేటాయించే అంశాన్ని చేర్చాలని అన్నారు.

## పది మంది లబ్దిదారులకు చెక్కులు అందజేసిన వెంకటేష్


లబ్ధిదారులకు చెక్కుల అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

**హైదరాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుక్రవారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో 10 మంది లబ్ధిదారులకు 6 లక్షల 56 వేల రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ప్రజలందరికి అనారోగ్య పరిస్థితుల్లో తోడుగా నిలిచి ఉన్నారని, వైద్య చికిత్సల కారణంగా వారికి ఆర్థిక సమస్యలు ఎదురుకాకుండా ఉండేందుకు ఎంత ఖర్చు అయినా లెక్క చేయకుండా సిఎంఆర్ఎఫ్, ఎల్ఓసిల ద్వారా అందరికి ఆర్థిక సాయం అందిస్తున్నారని చెప్పారు. చెక్కుల అందుకున్న లబ్ధిదారులు సిఎం కెసిఆర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హృదయాన్ని కాపాడుకోండి.. నవ్వుతూ జీవించండి
### డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** హృదయం ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పుడు నవ్వుతూ ఉండాలని, మీ హృదయాన్ని ఆరోగ్యకరమైన స్థితిలో ఉంచడానికి ఉత్తమమైన మార్గం సరైన ఆహారం తీసుకోవడం, నిద్రపోవడం, ఒత్తిడికి దూరంగా ఉండటమేనని సుల్తాన్‌బజార్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కోవిడ్‌పై పోరాటానికి ఏకమైనాయని, ఆరోగ్యం పట్ల వ్యక్తిగత బాధ్యతలను గుర్తు చేశాయని, కోవిడ్‌వల్ల ఎంతో హాని జరిగిందని, హృదయ సంబంధ వ్యాధులకు, కోవిడ్-19ల మధ్య సంబంధం ఉందని అధ్యయనాలు కూడా తెల్పాయని, అందువల్ల గుండెను జాగ్రత్తగా చూసుకోవడం మంచిదని ఆయన సూచించారు. ఈ ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మీరు, మీ కుటంబ సభ్యులు హృదయ నాళ సమస్యలను తరిమికొట్టడానికి గుండె పరీక్షలు చేయించుకుని ఎక్కువ కాలం జీవించాలని కోరారు. అధిక రక్తపోటు వల్ల గుండె ఆగిపోయే ప్రమాదం ఉందని, అందుకుని ఎప్పటికప్పుడు రక్తపోటు ఎంత ఉందని తెలుసుకోవడం చాలా ముఖ్యమని, అధిక రక్తపోటు మాత్రమే కాదు, తక్కువగా రక్తపోటు ఉండటం కూడా గుండెకు మంచిది కాదని మనోజ్‌రెడ్డి చెప్పారు. గుండెకు మేలు చేసే సమతుల్య ఆహారం తీసుకుంటూ క్రమం తప్పనిసరిగా వ్యాయామం చేస్తూ ఉండాలని, శరీరానికి శ్రమ ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు.

## స్వామినాథన్ మృతికి రాజన్న ప్రగాఢ సంతాపం

**సైఫాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, రైతు బాంధవుడు, పద్మవిభూషణ్ ఎం.ఎస్. స్వామినాథన్ మృతి పట్ల భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించింది. దేశంలో ఆహారదాన్యాల ఉత్పత్తి పెరగడానికి స్వామినాథన్ చేసిన కృషి మరువలేనిదని, వరి, గోదుమ పంటలపై అనేక ప్రయోగాలు, సిఫార్సులు చేశారని, దేశంలో వ్యవసాయరంగానికి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు కొనియాడారు. స్వామినాథన్ కమిటి చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వంతోపాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, కేం ద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయాలని ఆయన శుక్రవారం నాడిక్కడ పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## పేదలకు ఆసరా ప్రభుత్వ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

**కొంపల్లి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** మున్సిపాలిటీకి చెందిన 21మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే వివేకానంద్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, ఆర్ఐ భారతి, కెఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ రవియాదవ్, వసంత, నాయకులు కుమార్‌గౌడ్, వేణుయాదవ్, నరహరి, సంగీతరెడ్డి, లబ్దిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

## హబ్సిగూడలో పొంగుతున్న డ్రైనేజీలు : మురుగునీటితో స్థానిక ప్రజల అవస్థలు



హబ్సిగూడ వీధినెం.1లో రోడ్లపై పొంగుతున్న డ్రైనేజీ నీరు దృశ్యం.

**ఉప్పల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హబ్సిగూడలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంవల్ల స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రధాన రహదారిలోని అనుమతికి విరుద్ధంగా కొన్ని హోటల్స్, రెస్టారెంట్స్ నిర్వాహకులు డ్రైనేజీ లైన్లు నేరుగా కాలనీలోకి వెళ్లే లైన్లలోకి మురుగునీరు మళ్లించారు. దీంతో హబ్సిగూడ వీధి నెం.1లో నిత్యం డ్రైనేజీ పొంగి స్థానికులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. దీనిపై జిహెచ్ఎంసి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఐక్య మాదిగ హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నానాపురం శివ రాజ్‌మాదిగ ఆరోపించారు. ప్రధాన రహదారిలోని కృతింగ రెస్టారెంట్ నుంచి డ్రైనేజీ నీరు నేరుగా తమ కాలనీలోకి కలుపారని, దీని వల్ల తాము అవస్థలు పడుతున్నామని ఆయన పేర్కొన్నారు. దీంతోపాటు ఒయుకు సంబంధించిన భూములలో ఫోర్జరీ పత్రాలతో స్థలాలు తీసుకుని కార్లు పార్కు చేస్తున్నారని, దీనివల్ల తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రధాన రహదారిలోని హోటల్స్, రెస్టారెంట్స్ నిర్వాహకులు చెత్తాచెదారం డ్రైనేజీలోకి వేయడంవల్ల నిత్యం డ్రైనేజీలు పొంగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నిబంధనలు పాటించని హోటల్స్ సీజ్ చేయాలని కోరారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## వేలంలో రూ.4.15 లక్షలు పలికిన అల్మాస్‌గూడ లంబోదరుని లడ్డూ



వేలంలో లడ్డూను పొందిన రామిడి తూఫాన్‌రెడ్డి



బాలాపూర్ బిసి సంఘం గణేషుని లడ్డూను పొందిన బద్దం తిరుమల్‌రెడ్డి



వేలంలో వరుసగా 5వ సారి లడ్డూను పొందిన కుమారస్వామి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** లడ్డూ వేలాల్లో ప్రసిద్ధి చెందిన గ్రామాల్లో ఒకటైన అల్మాస్‌గూడలో శ్రీరామాంజనేయ భక్తభజన మండలి ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరస్తాలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బంగారు సత్యనారాయణ, రామిడి రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డిలతోపాటు పలువురి సమక్షంలో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ. 4.15లక్షలకు రామిడి తూఫాన్‌రెడ్డి లడ్డూను దకి ్కంచుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఆయను ఘనంగా సన్మానించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏనుగు లక్ష్మారెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.1.50 లక్షలు పలికిన బాలాపూర్ బిసి సంఘం వినాయకుడి లడ్డూ...** బాలాపూర్ గ్రామంలో బిసి సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద ఉత్సవ కమిటీ వారు నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.1.50 లక్షలకు బద్దం తిరుమల్‌రెడ్డి కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్జు బాలరాజ్, మేకల సంజీవ, జూకంటి సురేష్‌గౌడ్, అరవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

**రూ.లక్ష పలికిన పుట్టలమ్మ వినాయడి లడ్డూ...** మీర్‌పేట్‌లోని పురాతన పుట్టలమ్మ దేవాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి మండపంవద్ద డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవిఈశ్వర్‌గౌడ్ సమక్షంలో నిర్వహించిన వేలంలో బొమ్మని ప్రేమ్‌కుమార్ రూ.లక్షకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మని సుదర్శన్, ఎరుకల సురేష్‌గౌడ్, గంగపుత్ర శ్రీనివాస్, పల్లె బాబుగౌడ్, బండిరాళ్ళ శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

**5వ సారి లడ్డూను దక్కించుకున్న కుమారస్వామి...** మీర్‌పేట్ కార్పొరేషన్ ఓల్డ్ బాలాజీనగర్‌కాలనీలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంలో రూ.1.55 లక్షలకు సిరిగిరి కుమారస్వామి లడ్డూను దక్కించుకున్నారు. అయితే గతంలో నాలుగు సార్లు వేలంలో లడ్డూను పొందిన కుమారస్వామి ఈ సారి అతనే దక్కించుకోవడం గమనారం. ఈ మేరకు నిర్వాహకులు ఆయనను సన్మానించి లడ్డూ అందజేశారు. కార్యక్రమంలో కాలనీఅధ్యక్షుడు మధుసూదన్‌రావు, డా. వెంకన్న, సుబ్బారావు, డాక్టర్ నరేంద్రకుమార్, శ్రీనివాస్‌గౌడ్, భానుతేజ్‌గౌడ్, అనీష్, మనీష్, మహేష్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనస్థలిపురంలో గణనాథుల నిమజ్జనాలతోపాటు లడ్డూ వేలం పాటలు



వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న వినయ్‌గౌడ్



ప్రసాదాల పంపిణీ కార్యక్రమంలో విజయ్ తదితరులు

**వనస్థలిపురం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** గణపతి ఉత్సవాలలో భాగంగా వనస్థలిపురం పరిసరప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతులను లడ్డూ వేలాలు నిర్వహించి, మేళతాళాలతో నిమజ్జనానికి తరలించారు. సాహెబ్‌నగర్‌లోని శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంలో ఇంజాపూర్ గ్రామ నివాసి వినయ్‌గౌడ్ రూ. 5క్షల 1 రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దగౌని జగన్‌గౌడ రంజిత్‌గౌడ్, సతీష్‌గౌడ్, మనీష్‌గౌడ్, నవీన్‌గౌడ్, మానవ్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద అభిమన్యు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డూ వేలంలో గంగిరెడ్డి రాధాకృష్ణరెడ్డి రూ. 4 లక్షల36,800లకు లడ్డూ దక్కించుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బీరం శ్రీధర్, దీపాల రాజేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనం సందర్భంగా 5 రకాల అన్న ప్రసాదాల కిట్‌ను సుమారు 4వేల మంది భక్తులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తడకమళ్ల విజయ్‌కుమార్, వేముల జయరాములు, రవికుమార్, భువనగిరి శ్రీనివాస్, జోషి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు వెంటనే చేపట్టాలి : గీత



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో పెండింగ్ పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జలమలండలి జిఎం సంతోష్‌కుమార్, డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, ఇతర అధికారులతో డ్రైనేజీవ్యవస్థ, మంచినీటి సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. ఆనంద్‌నగర్ నుంచి మహంకాళి పంక్షన్ హల్ వరకు కొత్త సివరేజ్ లైన్ వేయాలని కోరారు. సాయిరాంనగర్, ధర్మపురికాలనీ, బీరప్పగడ్డ తదితర ప్రాంతాల్లో మంజూరైన పనులను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్,కార్యదర్శి జగన్, నారాయణ రెడ్డి, రామానుజం, శ్యామ్, బాలు, మధుసూధన్‌గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, రఘుపతిగౌడ్, మైసయ్య, బిక్షపతి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని విస్మరించిన సిఎం కెసిఆర్ : మల్‌రెడ్డి రంగారెడ్డి



పార్టీల చేరిన నాయకులతో మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ క్యాంప్ కార్యాలయంలో టిపిసిసి ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సొసైటీ బ్యాంకు డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్, పగడాల నాగేష్, భానుచందర్‌లతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో భారీ సంఖ్యలో చేరారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా విస్మరించారని, బంగారు తెలంగాణగా మారుస్తానంటూ భ్రష్టు పట్టిన తెలంగాణ మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్రవంతి, చందు, బింగి దాస్‌గౌడ్, బి.మహిపాల్, ఆనంద్‌కుమార్, బాలరాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లు తీర్చాలి



ఆశావర్కర్లకు సంఘీభావం తెలిపి ధర్నాలో పాల్గొన్న చిగిరింత పారిజాత

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం బాలాపూర్‌లోని మండల రెవెన్యూ కార్యాలయంవద్ద ఆశావర్కర్లు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించి, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించి హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. అదే విధంగా రూ.5 లక్షల ప్రమాద భీమా, రూ.5 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, నేనావత్ బాలు నాయక్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: సీఐటీయూ

**హయత్‌నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజనకార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ మండిపడ్డారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు హయత్‌నగర్‌లోని ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022లో కార్మికుల వేతనాలను 2000 రూపాయల మేర పెంచినట్లు ప్రకటించి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. పాఠశాల ప్రారంభంనుంచి ఇప్పటివరకు మెస్‌బిల్లులు, గుడ్డు బిల్లులు అందకపోవడంతో కార్మికులు అప్పులు తెచ్చి విద్యార్థులకు వండిపెట్టలేక ఇబ్బందుల పాలవుతున్నారని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు వారికి పెంచిన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, నిర్మలమ్మ, స్వరూప, యాదమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థులు కళల పట్ల అవగాహన పెంచుకోవాలి : డాక్టర్ నరేందర్‌రెడ్డి




డాక్టర్ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆల్ఫోర్స్ అధ్యాపకులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** విద్యార్థులు కళల పట్ల అవగాహన పెంపొందించుకొని, వాటిలో పాల్గొనేలా ప్రోత్సాహం అందించాలని తద్వారా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించవచ్చని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆల్‌ఫోర్స్ జూనియర్ కళాశాలఆధ్వర్యంలో ఆల్ఫోర్స్ గ్లామర్ 2023 పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు కళలు,క్రీడలు, పోటీలలో పాల్గొనడానికి ఆసక్తితో ఉండాలని, వాటిపట్ల దృష్టి సారించాలని సూచించారు. సాంప్రదాయాలు తెలుసుకోవాలని వాటిని అనుసరించి ఆదర్శంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఐఐటి, ఎన్ఐటి మెడికల్ కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులను సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్పుడు పత్రాలతో భూమిని సొంతం చేసుకునే వారిపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న యువజన సంఘం ప్రతినిధులు

**హయత్‌నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాముల గ్రామపరిధి సర్వేనెంబరు 451లో క్రాంతి యువజన సంఘానికి సంబంధించిన భూమిని తప్పుడు సమాచారంతో జీవోనెంబరు.59 కింద సొంతం చేసుకోవాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘం ప్రతినిధులు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష,కార్యదర్శులు గూడెపు జగన్‌గౌడ్, జోర్క నరహరి మాట్లాడుతూ... సర్వేనెంబరు 451లో 12 గుంటల భూమి ఉందని, అందులో 6 గుంటల భూమి క్రాంతి యువజన సంఘానికి చెందిన దిగా రెవెన్యూ రికార్డులలో ఉందని, స్థలానికి హద్దురాళ్లను ఏర్పాటు చేసుకుని కాపాడుకుంటున్నామన్నారు. ఈ స్థలానికి సంబంధం లేని వ్యక్తి అందులో ఎలాంటి నిర్మాణం లేకున్నా... పట్టా భూమిలోని ఫ్యాక్టరీని అడ్డుపెట్టుకుని తప్పుడుపత్రాలతో జీవో నెం.59కింద దరఖాస్తు చేసుకున్నాడని వివరించారు. సంబంధిత విచారణ అధికారిని తప్పుదోవ పట్టించాడా లేకా అధికారి అతనికి అనుకూలంగా వ్యవహరించారా అనే విషయంపై విచారణ జరిపి తప్పుడు పత్రాలతో దరఖాస్తు చేసుకున్న వ్యక్తితోపాటు తప్పుడు నివేదిక ఇచ్చిన విచారణ అధికారిణిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్లు పబ్బతి లక్ష్మణ్, హరిశంకర్ ఉన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన : పన్నాల



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ పన్నాల

**నాచారం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** మల్లాపూర్‌డివిజన్ పరిధిలోని కె.ఎల్.రెడ్డినగర్‌లో వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతోపాటు బీఆర్ఎస్ నాయకులు తండా వాసుదేవ్ గౌడ్, పల్లెకుమార్ యాదవ్, బుసాని రఘు, ఎల్లేష్, శ్రవణ్ తధితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వాయిదాలో ఎలాంటి దురుద్దేశం, రాజకీయ ప్రమేయం లేదు: ఛైర్మన్ శ్రీకర్‌రెడ్డి

**హయత్‌నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** నార్ముల్ మదర్‌డెయిరీలో మూడు పాలకవర్గ స్థానాలకు ఈ నెల 27న జరగాల్సిన ఎన్నికల వాయిదాలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం, పాలకవర్గ ప్రమేయం లేదని సంస్థ ఛైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సంస్థ కార్యాలయంలో మాట్లాడుతూ బుధవారం నాటి సర్వసభ్య సమావేశంలో కొందరు సొసైటీ ఛైర్మన్లు చేసిన ఆరోపణలు అసత్యమని, వాస్తవ విరుద్ధమన్నారు. నార్ముల్ యూనియన్‌లో ఓటు హక్కు పొందాలంటే ఏడాదిలో తప్పనిసరిగా 15వేల లీటర్ల పాలను పోసి ఉండాలన్నారు. ఈ మేరకు పాలను పోయని కొందరు ఓటు హక్కును కోల్పోయారని, వారు తాము 15వేల లీటర్లకు పైగా పాలను సంస్థకు పోశామని, తమకు ఓటు హక్కును కల్పించాలని ఈ మేరకు రికార్డులను పునఃపరిశీలన చేసిన తరువాతే ఎన్నికలను నిర్వహించాలని ఎన్నికల అధికారిని సంప్రదించారు. దీనిపై స్పందించిన ఎన్నికల అధికారి పూర్తి పరిశీలన అనంతరమే ఎన్నికలను నిర్వహిస్తాంటూ 9.9.2023న ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారని వివరించారు. పైగా కొన్ని పాల సంఘాలలోని అధ్యక్ష ఎన్నికలలో అవకతవకలు జరిగాయని డీసీఓకు ఫిర్యాదులు రాగా... దానిపై తగిననిర్ణయం తీసుకోవాల్సిందిగా డీసీఓ లేఖను కూడా పంపించారు. ఈక్రమంలో పూర్తి విచారణ అనంతరం ఎన్నికలను నిర్వహిస్తామని ఛైర్మన్ తెలిపారు. తాను ఏడాది క్రితం ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించే నాటికి సంస్థ 40 కోట్ల మేర అప్పులో ఉందని, సంస్థను గాడిన పెట్టి అటు రైతులకు, ఇటు వినియోగదారులకు, ఉద్యోగులకు మంచిచేయాలని చూస్తున్నామన్నారు. పాలసంఘల ఛైర్మన్లు, పాడిరైతులు డైరెక్టర్ల ఎన్నికపై వచ్చిన అసత్య ఆరోపణలను నమ్మరాదని త్వరలోనే ఎన్నికలను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఉప్పల్ శేషసాయికాలనీలో రికార్డు స్థాయిలో లడ్డూ వేలం



వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న దైనే సుధా శ్యామ్ దంపతులు

**ఉప్పల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ శేషసాయికాలనీలో వినాయక లడ్డూ వేలంపాట రికార్డు స్థాయిలో జరిగింది. వినాయక నిమజ్జనం సందర్భంగా కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో వినాయకుడి లడ్డూను స్థానికంగా ఉంటున్న దైనే సుధాశ్యామ్ దంపతులు దక్కించుకున్నారు. అనంతర లడ్డూను ర్యాలీగా తన ఇంటికి తీసుకుని వెళ్లారు. వినాయక చవితి సందర్భంగా కాలనీలో ఉత్సవాలు ఆనందోత్సవాలతో చేసుకున్నారని కాలనీ నేత పంగ రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ నేతలు పాల్గొన్నారు.

## ఉప్పల్ ఈస్ట్ కల్యాణపురిలో ఘనంగా శ్రీనివాస కల్యాణం

**ఉప్పల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** శ్రీ వెంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారికి సంకల్పించిన 111 కల్యాణాలలో భాగంగా ఉప్పల్ కల్యాణపురిలో 54వ శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈస్ట్ కల్యాణపురి కాలనీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, నాగలక్ష్మి దంపతులు,యోగ చైతన్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ రామచందర్‌రావు, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, సీనియర్ నేతలు గొరిగె కృష్ణ, శ్రీనివాస శర్మ, మహంకాళి లక్ష్మణ్, డి.బాలచందర్, రావుల బాలకృష్ణగౌడ్, కంచర్ల భరత్‌రెడ్డి, యు.బల్వంతచారి, గోనె అంజయ్య, శ్రీకాంత్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ లోక కల్యాణం కోసం శ్రీనివాసుని కల్యాణోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు జి.ఆనంద్‌రెడ్డి రేణుక, టి.రత్నకుమార్ రజిత దంపతులు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు : పంకజ



వివరాలు వెల్లడిస్తున్న ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ పంకజ

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. గురువారం రాత్రి సరూర్‌నగర్ చెరువువద్ద నిమజ్జన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్బీనగర్ జోన్ పరిధిలో 15 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. జిహెచ్ఎంసి, పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమర్జన కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించారని తెలిపారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది మూడు షిఫ్టుల లో 24 గంటలు పనిచేశారని అన్నారు. చెరువు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా భారికేట్లు ఏర్పాటు చేశామన్నారు. జోన్ పరిధిలో సుమారు 6 వేలు, సరూర్‌నగర్‌ప్రాంతంలో 2 వేల వినాయక విగ్రహాలు నిమజ్జనమయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సిటీప్లానర్ ప్రసాద్‌రావు, ఎస్ఇ అశోక్‌రెడ్డి, అధికారులు పోలీసులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో గణనాథులకు బిఎల్ఆర్ పూజలు

**ఉప్పల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రధాన రహదారిలోని గాంధీ విగ్రహం వద్ద గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనోత్స వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ఆనందోత్సవాలతో చేసుకోవడం అభినందనీయమన్నారు. ఉత్సవాలకు ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహంవద్ద లక్కిడ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్, అధ్యక్షుడు కుడుముల ప్రదీప్‌రెడ్డి, నేతలు అన్య బాలకృష్ణ, సుక్క కిరణ్, వర్కల రాజేందర్‌గౌడ్, ఎస్.వినోద్‌రెడ్డి, గడ్డం పాపిరెడ్డి, బజారు అర్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో విస్తృత పర్యటన : కార్పొరేటర్ శాంతిశేఖర్



స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వర్షాల నేపథ్యంలో నిలిచిపోయిన కార్తికేయనగర్ బ్రిడ్జి నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అన్నపూర్ణ కాలనీలో మంజూరైన పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇందిరానగర్ వైపు వెళ్లే దారి శాంతి గార్డెన్స్‌వరకు ప్రారంభమై ఆగిపోయిన డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రాఘవేంద్రనగర్ శివ నర్సింగ్ హోం వెను వీదిలో మంజూరైన పనులను ప్రారంభించకపోవడం పట్ల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, దాసరి కర్ణ, కట్ట బుచ్చన్నగౌడ్, రాంబాబు, జయపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, యాదగిరి, ప్రీతిరెడ్డి, చంద్రశేఖర్ కెప్టెన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ గణపతి లడ్డూను దక్కించుకున్న లక్ష్మినారాయణ



గణేష్ లడ్డూను దక్కించుకున్న లక్ష్మినారాయణ చిత్రంలో లక్ష్మణ్ తదితరులు



గణేష్ లడ్డూను స్వంతం చేసుకున్న చిక్కా చంద్రమోహన్



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి



గణేష్ లడ్డూను స్వంతం చేసుకున్న ఉత్తంశర్మ, నిషాశర్మలు

**మలక్‌పేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూవేలంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అమరవాది లక్ష్మినారాయణ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లడ్డూను దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఊరె లక్ష్మణ్, అసోసియేషన్ అధ్యక్షుడు పొద్దుటూరి రవీందర్, సభ్యులు పాల మధుసూదన్, రాముని రామనాథం, నరేష్‌కుమార్‌గోయల్, ఆమెటి శ్రీనివాస్, శంకర్, మోత్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.1.45లక్షలు పలికిన మలక్‌పేట మార్కెట్‌లడ్డూ....** మలక్‌పేట మార్కెట్‌లో శ్రీ కృపా మార్కెట్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లడ్డూ వేలంలో రూ. 1.45,116లకు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కా చంద్రమోహన్ దక్కించుకున్నారు. **ఓల్డ్ మలక్‌పేటలో...** ఓల్డ్ మలక్‌పేట శ్రీ ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ వేలంపాటలో భక్తుడు ప్రవీణ్ రూ. 41వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్‌చారి, పోచమ్మ ఆలయ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డిలు ప్రవీణ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాబు శ్రీనివాస్, కావలి రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **హరిహర క్షేత్రంలో...** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ వేలంలో రూ. 77 వేలకు ఉత్తంశర్మ, నిషా శర్మలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఛైర్మన్ సూగూరు రమేష్, ఇఒ మార్తాండరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్‌బోయిన్‌పల్లిలో సీసీ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## బిఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి : ఎమ్మెల్యే

**బేగంపేట సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్‌బోయిన్‌పల్లి (119) డివిజన్‌లో 3కోట్లతో సీసీరోడ్ల పనులకు ఆయన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి శంఖుస్థాపనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవిందరావు, వాటర్ వర్క్స్ ఏఈ తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, బల్వంత్‌రెడ్డి, మక్కల నర్సింగరావు, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, హరినాథ్, బుర్రి యాదగిరి, మట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అపార్థాల వల్లే భారత్ కెనడా మధ్య వివాదం

**ఇస్కాన్ వరల్డ్ ఆధ్యాత్మికవేత్త హెచ్‌హెచ్ భక్తి రాఘవ స్వామి మహారాజా**



పాఠశాల సందర్శించిన భక్తిరాఘవస్వామితో రైనఖ్ యార్‌ఖాన్, అపర్ణ వొల్లూరు తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** భారత్-కెనడా మధ్య వివాదం కేవలం ఒక అపార్థంకారణంగా జరిగిందని ఇస్కాన్ ప్రపంచ ఆధ్యాత్మిక నాయకుడు హెచ్‌హెచ్ భక్తి రాఘవ స్వామి మహారాజా అన్నారు. ఈరెండు దేశాలమధ్య జరిగిన సంఘటనలు త్వరలో చక్కదిద్దుకుంటుందని ఆశిస్తున్నానన్నారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన మాదాపూర్‌లోని ఫ్రీస్కూల్ చైన్ అయిన మైస్కూల్ ఇటలీ వ్యవస్థాపకురాలు ఆయన శిష్యులలో ఒకరైనా అపర్ణ వొల్లూరు ఆహ్వానం మేరకు పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా రాఘవస్వామి మాట్లాడుతూ సనాతన ధర్మం సార్వత్రిక ప్రవర్తనా నియమావలి అన్నారు. ఈపదానికి మతపరమైన అర్థం లేదన్నారు. తాను రోమన్ క్యాథలిక్ క్రైస్తవుడినని, తనశరీరం కెనడియన్, కానీ నా ఆత్మ భారతీయ సనాతనధర్మం పాటిస్తుందన్నారు. స్కూల్ బ్రాండ్ అంబాసిడర్ ఆసఫ్ జాహివంశం 9వ నిజాం హెచ్ఈ రైనఖ్ యార్ ఖాన్ మాట్లాడుతూ విభిన్న విశ్వాశాల ప్రజలను ఉమ్మడి ప్రయోజనాల కోసం తీసుకురావడంలో తాను అందరికీ సుపరిచయస్తుడినన్నారు. తనకు కమ్యూనిటీలను ఏకతాటిపై తీసుకురావడంలో చేసిన కృషికి గుర్తింపుగా పిహెచ్‌డి మంజూరు చేశారన్నారు. ఈసందర్భంగా ఆయనతోపాటు మరికొందరికి వేద గ్రంథాలైన భగవద్గీత, శ్రీమద్‌భాగవతం అందజేశారు.

## ఘనంగా 'మేరీ మాటి మేరీ దేశ్'



మేరీ మాటి మేరీ దేశ్ ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ షినీల్

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** ఆజాదిక అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేరీ మాటి మేరీ దేశ్ కార్యక్రమంలో శుక్రవారం కవాడిగూడలోని విరజానంద వైదిక్ విద్యాలయ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. భారత రక్షణ దళం, భారత యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్ర హైదరాబాద్, అరైజ్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంకు సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ షినీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైదిక్ విద్యాలయ మరియు ప్రభుత్వ పాఠశాల నుండి మట్టిని సేకరించి, ర్యాలీ నిర్వహించి, అనంతరం విద్యార్థులతో మేరీ మాటి, మేరీ దేశ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఖాలిద్, విజానంద వైదిక్ విద్యాలయ ప్రిన్స్‌పాల్ గడీల ఆంజనేయులు, అరైజ్ ఫౌండేషన్ అధ్యక్షులు టి.నీలకంఠ మహదేవ్, ఉపాధ్యక్షులు ఏ.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ సి.ప్రవీణ్ ట్రెజరర్ సీత సంతోషన, సేవ భారతి నుండి వనజ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామంతోనే**

## గుండె జబ్బులు నివారణ : డాక్టర్ సూర్యప్రకాష్ గుల్ల



గుండెజబ్బు నుంచి కోలుకున్న పేషెంట్‌ను సత్కరిస్తున్న సూర్యప్రకాష్

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** మంచి ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండాచేసే శారీరక వ్యాయామంతోనే గుండెజబ్బులు నివారించవచ్చునని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాష్ గుల్ల అన్నారు. శుక్రవారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్‌లో పేషెంట్ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ సూర్యప్రకాష్ గుల్ల మాట్లాడుతూ మానవ శరీరంలో గుండె ఎంతో ప్రధానమైందని, ప్రతి ఒక్కరూ గుండె గురించి అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటిస్తే గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. ప్రపంచంలో పెరిగిపోతున్న గుండె జబ్బులను దృష్టిలో పెట్టుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గుండె జబ్బుల నుండి కోలుకున్న రోగులను ఆయన శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేర్ హాస్పటల్ ఉపాధ్యక్షులు రాజుచౌరే, డాక్టర్ మహ్మద్ అబ్దుల్ నఫే, కార్డియాలజిస్ట్‌లు డాక్టర్ జాన్ కిషోఫర్, డాక్టర్ సుజితకుమార్ త్రిపాఠి, డాక్టర్ వినోతే కుమార్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ శిరీషరెడ్డి, డాక్టర్ అర్చన, డాక్టర్ మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వాకథాన్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** ఏటా సెప్టెంబరు 29న వరల్డ్ హార్ట్‌డేగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. గుండె ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈరోజు ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రెనోవా ఆధ్వర్యంలో శుక్రవారం నగర వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రుల్లో పలు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ పార్కునుంచి దర్గావరకు మూడు కిలోమీటర్ల పాటు వాకథాన్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా సివోవో రవీంద్రనాథ్ గరగజెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. అనంతరం గుండె సంబంధిత స్క్రీనింగ్ ప్యాకేజీలను ఆవిష్కరించారు. గుండెసంబంధిత వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టు డా.ఎండి షోయబ్ అహ్మద్, డైరెక్టర్ టి.నగేష్, రఘు పాల్గొన్నారు. వైద్యులు వైద్యేతర సిబ్బందితోపాటు లంగర్‌హౌజ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్

**నివాళులు అర్పించిన రైతు సంఘాల నేతలు**



ఎంఎస్.స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పించిన రైతు సంఘాల నేతలు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్ మృతి వ్యవసాయరంగానికి తీరనిలోటని రైతు సంఘాల నేతలు పునరుద్ఘాటించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎంఎస్.స్వామినాథన్ సంస్మరణ సభ రైతు సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. స్వామినాథన్ చిత్రపటానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, నాయకులు బొంతల చంద్రారెడ్డి, మూడ్ శోభన్, బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, నున్న నాగేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, మాటూరి బాలరాజ్, కనకారెడ్డి, సోమయ్య, భూక్య చందు, మధుసూదన్‌రెడ్డి, శెట్టి వెంకన్న, ఈసంపల్లి బాబు, వర్ణ వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాస్, డి.బాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, యాదవరెడ్డి, సారంపల్లి భాగ్యలక్ష్మి, చీరిక అలివేలు తదితరులు పాల్గొన్నారు. 1960లో అధిక దిగుబడినిచ్చే గోధుమలు, వరి రకాలను అభివృద్ధి చేయడంలో ప్రచారం చేయడంలో స్వామినాథన్ కీలకపాత్రకు గుర్తింపుగా 1987లో స్థాపించిన ప్రపంచ ఆహార బహుమతికి మొదటి గ్రహీత అని అన్నారు. 1988లో ఎంఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించాడని గుర్తు చేశారు. 2004లో రైతులపై జాతీయ కమిషన్ అధ్యక్షుడిగా స్వామినాథన్ కనీస మద్దతు ధరను అందించాలని సిఫార్సు చేశారన్నారు. ఉత్పత్తి సమగ్ర వ్యయం 50 శాతం సమానంగా ఉండాలని చెప్పారు. చారిత్రాత్మకమైన రైతుల పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన డిమాండ్‌గా మిగిలిపోయిందని అన్నారు. మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇది ఇంకా అమలు కాలేదన్నారు.



బోయిన్‌పల్లి మార్కెట్‌ను సందర్శించిన న్యూ ఢిల్లీ, జార్ఖండ్‌లకు చెందిన వ్యవసాయ మార్కెట్ ట్రెనింగ్ అధికారులు

## బోయన్‌పల్లి మార్కెట్‌ను సందర్శించిన కేంద్ర వ్యవసాయ మార్కెట్ ట్రెనింగ్ అధికారులు

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన బోయిన్‌పల్లిలోని అంబేద్కర్ వ్యవసాయ మార్కెట్‌ను శుక్రవారం కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ విభాగంలో ఎంపికైన ట్రెనింగ్ అధికారులు బోయిన్‌పల్లి మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్ ప్రాంగణంలోని వివిధ కూరగాయల వ్యాపార సముదాయాలను, బయోగ్యాస్‌ను సందర్శించారు. భారత ప్రధానీ నరేంద్ర మోడి,బోయిన్‌పల్లి మార్కెట్‌లో నిర్వహించిన బయోగ్యాస్‌పై మాన్‌కీ బాత్‌ను ప్రశంసించినందుకు అందులో ఉన్న బయోగ్యాస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హారిక ఆనంద్ బాబు, కార్యదర్శి వెంకన్న, మార్కెట్ గౌరవ సభ్యులు బత్తుల నారాయణ, మీనా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు బిఆర్ఎస్‌కు మద్దతు పలకాలి: ఎమ్మెల్యే

**సైదాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ బిఆర్ఎస్ అభ్యర్థిగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేరును పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో చంపాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె రవీందర్, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్ గుప్తాల ఆధ్వర్యంలో సంఘం నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులు తనకు మద్దతు పలకాలని కోరారు. ఎల్‌బినగర్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయాలతో అభివృద్ధి చేయడం జరిగిందని, రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సహకరించి తనను మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అమావాస్య అన్నదాన కార్యక్రమం కన్వీనర్ ఇడుపుల విజయనాథ్, గౌరవాధ్యక్షుడు సాయిరాం, బిఆర్ఎస్ నాయకులు ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తా, ఊరె మధుసూధన్, ఆకుతోట వెంకట్ గుప్తా, జూలూరు చంద్రశేఖర్ గుప్తా, సోమ జగన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## అవేర్‌గ్లెనిగల్స్ గ్లోబల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో '5కె వాక్'

**సైదాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అవేర్ గ్లెనిగల్స్ గ్లోబల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 5కె వాక్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రోజు వ్యాయామం, వాకింగ్ చేయడంవల్ల గుండె జబ్బుల బారిన పడకుండా కాపాడుకోవచ్చున్నారు. రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ తగిన విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, రాజీవ్‌గార్గ్, ముఖేష్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మహీంద్రస్వామి, సుదర్శన్‌రావు, సంజీవరావు, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెగా జాబ్‌మేళా..

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

సనత్‌నగర్ డివిజన్‌లోని ఎర్రగడ్డ రైతు బజార్ ఎదురుగా డాన్‌బాస్కో దిశ సంస్థ ఆధ్వర్యంలో సెయింట్ థెరిసా చర్చ క్యాంపస్ నందు సంస్థ ప్రతినిధులు ఐవన్‌వాజ్ పర్యవేక్షణలో ఈ నెల నేడు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐవన్ వాజ్ తెలిపారు. ఈ మేళాలో 25ప్రముఖ కంపెనీలు, 3వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఐవన్ వాజ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని, అధిక సంఖ్యలో యువతీ యువకులు పాల్గొని ఉద్యోగ అవకాశాలను దక్కించుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి నుండి పీజి చదివిన వారు అనుభవం ఉన్నవారు లేనివారు, 3కాపీలు రెస్యూమ్స్‌లతో పాటు ఆధార్, పాన్ జిరాక్స్‌లను వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

## మహాపూర్ణాహుతితో ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** తొమ్మిది రోజులుగా వివిధ రకాల పూజలందుకున్న ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో నవరాత్రోత్సవాల్లో మహాపూర్ణాహుతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై పూజలు నిర్వహించారు. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయం మాజీ చైర్మన్ బిఎన్.శ్రీనివాస్‌రావు యాదవ్, ధర్మకర్తల మండలి సభ్యులు రమణమూరిత, హరిత, స్వరూప, అరుణశ్రీ, రాజా శ్రీనివాస్, ఆలయం అర్చకులు కాశీనాథ్ శర్మ, గోపాలాచార్యులు, బుచ్చమాచార్యులు, రామాచార్యులు, జగన్మోహనాచార్యులు, ఆలయం సిబ్బంది రాజు, రాజన్ భక్తులు పాల్గొన్నారు.

## రూ. 1 లక్ష 80 వేలు పలికిన గణేశుని లడ్డూ

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా రామారావు నగర్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద గణేష్ లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈవేలం పాటను రమేష్ ఫిష్ స్టాల్ నిర్వాహకులు కీర్తి శేషులు రమేష్ కుమార్ దిలీప్‌కుమార్, ప్రదీప్ కుమార్, సందీప్ కుమార్‌లు రూ.1లక్ష80వేలకు గణేష్ లడ్డును కైవసం చేసుకున్నారు.ఈకార్యక్రమంలో బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.వెంకటయ్య యాదవ్, సెక్రటరీ వెంకటరమణ, చైర్మన్ రామకృష్ణ, అడ్వైజర్ నాగుల సత్యం, ఆవుల సంజీవ, పాల్గొన్నారు.

### జర్నలిస్టుల హక్కులపై ఐక్య పోరాటానికి సన్నద్ధం కావాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, నూతన చట్టాల సాధన కోసం ఐక్య పోరాటానికి సన్నద్ధం కావాలని పలు జర్నలిస్టు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలు, పిటిఐ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ యూనియన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్ రోడ్‌లోని పిటిఐ భవన్ ఎదుట జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. ధర్నాలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్‌డబ్ల్యూజే, అనుబంధ సంఘాల నాయకులు, పిటిఐ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, చట్ట వ్యతిరేక చర్యలు కొనసాగుతునా న్నయని, మరోవైపు కే ంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరివల్ల జర్నలిస్టులు ఆందోళన చెందుతున్నారని విచారం వ్యక్తం చేశారు. పిటిఐ ఉద్యోగుల విషయంలో యాజమాన్యం అవలంభించిన అక్రమ చర్యలపై పోరాటాల ఫలితంగా కోర్టు తీర్పు ద్వారా న్యాయం జరిగినా యాజమాన్యం న్యాయం చేయకపోవడం అన్యాయమన్నారు. జర్నలిస్టులకు కొత్త వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని, జాతీయ పెన్షన్ స్కిమ్‌ను ప్రవేశపెట్టాలని, రైల్వే రాయితీ పాస్‌లను పున:రుద్ధరించాలని సోమయ్య డిమాండ్ చేశారు.

## ఆశాల ధర్నాకు కాంగ్రెస్ నాయకుల మద్దతు

**నార్సింగి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** దశాబ్దాల తరబడి నామమాత్రపు జీతాలకు పనిచేస్తున్న ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను సర్కారు పరిష్కరించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నార్సింగి చౌరస్తాలో ఆశా వర్కర్లు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. శుక్రవారం జరిగిన దీక్షలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు జ్ఞానేశ్వర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్ కట్ట అశోక్‌లు మద్దతు తెలిపి, వారి పక్కనే కొంత సమయం దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ వైద్య సిబ్బందితో సమానంగా ఆశా వర్కర్లు పని చేస్తున్నా వారికి సరైన జీతాలు ఇవ్వకుండా దశాబ్దాల నుంచి వెట్టి చాకిరి చేయించు కుంటున్నారని ఆరోపించారు. సమాన పనికి సమాన జీతాలు ఇవ్వాలని న్యాయస్థానం అనేకమార్లు ఆదేశాలు జారీ చేసినా తెలంగాణ సర్కారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలు, కిందిస్థాయి ఉద్యోగుల వెతలను పట్టించుకోని నియంతృత్వ సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఓటుతో పోటు పొడువడం ఖాయమన్నారు. ఏ పల్లె చూసినా, పట్నం చూసినా ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని వివరించారు. ప్రజల నాడీ, గాలి చూస్తుంటే హస్తం హవా ముందు కారు అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కే అవకాశం కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్ల ప్రధాన డిమాండ్లన్నింటిని పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్ణాహుతి పూజలు

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ స్టేషన్ సమీపంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ గణపతి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన పూర్ణాహుతి పూజా కార్యక్రమాలకు మోండా డివిజన్‌కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో అలయ చైర్మన్ ఓదెల సత్య నారాయణ, ఈఓ వినోద్, ధర్మకర్తలు ఎం.హన్మంత్ రావ్ యాదవ్, వినోద్, సాయి ప్రకాశ్, బిజెపి నాయకులు కొంతం నరేశ్, వీరవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**నేడే హుండీ లెక్కింపు...**

గణపతి దేవాలయంలో శనివారం హుండీ లెక్కింపు జరగనున్నట్లు ఆలయ ఈఓ వినోద్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

### కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్ విజయం తథ్యం : రంగ రవిందర్ గుప్త

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత బారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని 7వ వార్డుకు చెందిన తెలంగాణ ఉద్యమ నేత రంగ రవిందర్ గుప్త వ్యక్తం చేశారు. శుక్రవారం బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పరశరామ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌బినగర్ బిఆర్ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడిగా రవి ముదిరాజ్

**సైదాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడిగా చంపాపేటకు చెందిన రవి ముదిరాజ్ నియమితులయ్యారు. ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం రవి ముదిరాజ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. రవి ముదిరాజ్ ప్రస్తుతం చంపాపేట బిఆర్ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌బినగర్ నియోజకవర్గంలో మరెక్కడా లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలోని అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి బిఆర్ఎస్ విజయఢంకా మోగించనుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, బిసి సంఘాల జెఏసి చైర్మన్ ఓరుగంటి వెంకటేశం, ముదుపు రాజిరెడ్డి, ఉమా మహేశ్వర్, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, జంగయ్య, ప్రభాకర్, తిరుమలేష్, సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించాలన్న బిల్ కలెక్టర్‌పై ఇంటి యజమాని దాడి

**నార్సింగి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని నర్సారెడ్డి కాలనీలో విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు వెళ్లిన బిల్ కలెక్టర్‌పై ఇంటి యజమాని దుర్భాశలాడుతూ, భౌతిక దాడి చేశాడు. బిల్లులు కట్టేది లేదు, ఏం చేసుకుంటావో చేసుకో పో అంటూ దాడి చేశాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుడైన బిల్ కలెక్టర్ తేజ సాయి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా తేజసాయి మాట్లాడుతూ శుక్రవారం నర్సారెడ్డి కాలనీలోని ఓ ఇంటికి కరెంటు బకాయిలు వసూలు చేసేందుకు వెళితే, యజమాని భౌతిక దాడులు చేశాడని, బిల్ కట్టకుంటే ఏమి చేసుకుంటావో చేసుకో పో అంటూ అక్కడి నుంచి తోసేశాడని పేర్కొన్నారు. నా విధులను అడ్డుకోవడమే కాకుండా, నాపై భౌతిక దాడి చేసిన సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తేజసాయి డిమాండ్ చేస్తున్నాడు. కరెంటు బిల్లులు కట్టని వారి ఇళ్లకు కనెక్షన్లను కట్ చేయాలని, నెలంతా వాడుకొని డబ్బులు అడిగేతే దాడులు చేయడం ఏమిటని, ఇది ఎక్కడి దౌర్జన్యమని ప్రశ్నించాడు. ఈ విషయంపై విద్యుత్‌శాఖకు చెందిన ఉన్నతాధికారులు, పాలకులు అందరూ స్పందించి సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, లేదంటే ఇలాంటి వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, అప్పుడు మొండి బకాయిలు పెరిగి పోతాయని తేజసాయి పేర్కొన్నారు.

**నాలాలో పడి మృతి చెందిన**

# మహిళ ఆచూకి లభ్యం

**మెట్టుగూడ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :**

మెట్టుగూడ దూద్ బావి రైల్వే ఆర్‌యూబీ వద్ద ఉదృతంగా వచ్చిన వర్షపునీటితో నాలాలో పడి మృతి చెందిన మహిళ ఆచూకి లభించింది. స్థానిక మేడిబావి వద్ద ఉండే వెంకటమ్మ(52)గా గుర్తించారు. ఆమెకు ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. ఇద్దరికి వివాహాలు కాగా మరో అమ్మాయికి పెళ్లి కాలేదు. గురువారం రాత్రి దూద్‌బావివద్ద నుంచి ఆమె ఇంటికి నడుచుకుంటు వెళ్లుతుంది. అదే సమయంలో వర్షపు నీటి వదృతంగా నాలాలోకి నీరు వెళ్తుతుంది. అయినా ఆమె అక్కడి నుంచి వెళ్లుతుండంతో స్థానికులు చూసి వద్దని చెప్పినా ఆమె వినిపించుకోకుండా వెళ్లింది. దీంతో ఆమె నీటిలో కొట్టుకొని వెళ్లిన విషయం తెలిసిందే. కాగా నాలా పరిస్థితి తెలుసుకునేందుకు శుక్రవారం ఉదయం జోనల్ కమీషనర్ రవికుమార్, కార్పొరేటర్ రాసూరి సునిత ఘటనా స్థలానికి చేరుకుని నీరు సక్రమంగా వెళ్లేవిధం గా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం ద్వార, డిప్యూటీ స్పీకర్ పద్మారావు సహకారంతో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

## వినాయక లడ్డూ వేలం..

**రూ. 3.40 లక్షలకు పాడుకున్న సత్యనారాయణ**

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా వివేకానంద నగర్ కాలనీ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపంవద్ద ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని గణాల జంగారెడ్డి, నర్మదారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం జరిగింది. ఈసందర్భంగా లడ్డు వేలం పాటలో రూ.3లక్షల,40వేల116లకు దాసరి సత్యనారాయణ కైవసం చేసుకున్నారు. అదేవిధంగా వెంకటేశ్వర స్వామి వారి లడ్డుని రూ.1లక్ష45వేల116లకు, వివేకానందనగర్ సేవా సమితి కమిటి అధ్యక్షులు గంగుమళ్ళ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గంగుమళ్ల వరప్రసాద్ సుజాత దంపతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చ బిజేపి ఉపాధ్యక్షులు పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్, గంగుమళ్ళ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గంగుమళ్ళ వరప్రసాద్, సీనియర్ బిజెపి నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్,పన్నాల హరీష్ రెడ్డి, పోలిశెట్టి శ్రీనువాస్, బొంతు హరికృష్ణ, చెల్లయ్య, దేవిరింటి మస్తాన్ రెడ్డి, రవి ముదిరాజ్, కాయితీ యాదవరెడ్డి, శ్రీనువాస్ పాల్గొన్నారు.

**గాయత్రినగర్‌లో...**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గాయత్రి నగర్‌లో విజ్ఞానజ్యోతి పాఠశాలలో గణనాధునికి ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. అనంతరం విద్యార్థిని విద్యార్థులు బ్యాండ్ మేళాలతో నృత్యాలు చేస్తూ దుర్గం చెరువుకు నిమజ్జనానికి తరలి వెళ్ళారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

**రాజీవ్‌గాంధీనగర్‌లో...**

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాజీవ్ గాంధీనగర్‌లో ఏ బ్లాక్‌లో శ్రీగణేష్ యూత్ అసోసియేషణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమాల్లో నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. గత 21 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో గణనాధుని మండపాన్ని ఏర్పాటుచేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏ బ్లాక్ అధ్యక్షులు రమేష్ తెలిపారు.ఈకార్యక్రమంలో ముత్యాల దుర్గ, యోగిరాజు స్వామి, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

**మధురానగర్‌లో...**

మధురానగర్ బి బ్లాక్‌లో నవయువ నాగ గణపతి కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద లడ్డు వేలంపాటలో లడ్డుని వెంకట ప్రసాద్ విజయలక్ష్మీ దంపతులు రూ.1లక్ష27వేలకు సొంతం చేసుకున్నారు.

**వెంకటగిరిలో...**

వెంకటగిరి యూత్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో గత 25సంవత్సరాలుగా నవరాత్రి ఉత్సవాలను గణంగా నిర్వహిస్తున్నారు. పోటాపోటీగా నిర్వహించిన లడ్డు వేలంపాటలో స్థానికంగా వెంకటగిరిలో ఉండే ఆవుల చంద్ర మోహన్(చందు) రూ.1లక్ష27వేల501లకు లడ్డును కైవసం చేసుకున్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహక అధ్యక్షులు పులిరామ్, ఉపాధ్యక్షులు జ్ఞానేశ్వర్, లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి బడుగు సతీష్, కమిటి సభ్యులు రవికుమార్‌గౌడ్, రాజేందర్ గుప్త, శ్రీనువాస్, నాగార్జున, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

### రూ. 2 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న రమాఖాన్

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** పర్వత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ వరసిద్ది వినాయక సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద లడ్డు వేలం పాటలో రమాఖాన్‌కు రూ.2లక్షల, 5 వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం నిమజ్జనానికి తరలి వెళ్లారు. ఈకార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ప్రతాప్, శేఖర్, జనార్ధన, నవీన్, నిరంజన్, రాము, గణేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

### సాయిరాంనగర్ కాలనీ లడ్డూ రూ.1,11,000

**సైదాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ సాయిరాంనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏరా ్పటు చేసిన గణనాధుడి వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో దిల్‌సుఖ్‌నగర్ షిర్డీ సాయిబాబ దేవాలయం ట్రస్టు మెంబర్ కోడి రాజశేఖర్ నేత రూ.1,11,000లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బ శ్రీనివాస్‌గుప్తా, భూపతి రవీంద్రనాథ్, చిలుక నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, పర్వత్‌రెడ్డి, బచ్చు శ్యామ్‌గుప్తా, కొండూరి కిరణ్, శర్మ, సిద్ది రామప్ప తదితరులు పాల్గొన్నారు.

### గణనాధుడి లడ్డూను దక్కించుకున్న కృష్ణమాచారి

**సైదాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** సామ సరస్వతినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడి మండపం వద్ద జరిగిన గణనాధుడి లడ్డూ వేలం పాటలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి రూ.45 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి జగదీశ్వర్, బండారు కొండయ్య, మోతిలాల్, దేవేందర్, సాయి, హనుమాన్, శ్రీను, భాను తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టు కాలనీలో రూ.1లక్ష75వేలు పలికిన గణపయ్య లడ్డూ

**నిజాంపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నివాస్ జర్నలిస్టు కాలనీలో కొలువుదీరిన గణనాథుని శోభ యాత్ర శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా నవ రాత్రులు అత్యంత భక్తి శ్రద్దలతో పూజలందుకున్న గణపయ్య లడ్డూను వేలం వేయగా రూ,1లక్షా75వేల రూపాయలకు కాలనీకి చెందిన టేకుల సుధాకర్‌రెడ్డి దంపతులు దక్కించుకున్నారు. వారు మాట్లాడుతూ గణనాథుని లడ్డూను కైవసం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించి స్వామివారి లడ్డూను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అస్కాని మారుతీసాగర్, ఉపాధ్యక్షులు కొలెపాక వెంకట్, ఉద్దండపురం వెంకటేశ్‌గౌడ్, లాలయ్య, జగదీష్‌గుప్తా, నాగేంద్రచారి, మణికంఠ కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** వరల్డ్ హార్ట్ డే సందర్భంగా లైన్స్‌క్లబ్ బంజార హిల్స్ అధ్యక్షులు కెల్లా వెంకటరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో స్థానిక కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ పాల్గొన్నారు. గుండె సంబంధించిన, బీపి, షుగర్‌లతో పాటు కంటి పరిక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమయిన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పేదలు నివసించే ప్రాంతంలో ఇలాంటి వైద్య శిభిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడు కునేందుకు ఎప్పటికపుడు పూర్తిస్థాయిలో వైద్యపరిక్షలు చేయించుకొని ఆరోగ్య వంతమైన జీవనం గడపాలని సూచించారు. ఈకార్యక్రమంలో లైన్స్ క్లబ్ సెక్రటరీ కైలాస్, సుబ్బారావు, సత్యనారాయణ, రోనంకి జగన్నాథం, నాగుల సత్యం, ఆవుల సంజీవ, కృష్ణమూర్తి, అగతముడి రమేష్, వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీనువాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్‌లోని ఆర్యవైశ్య సంఘం ప్రసాద పంపిణీలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ మహాలక్ష్మి, సంఘం మహిళలు

**కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
**హైదరాబాద్**

నిట్ నం: టెండర్ ప్రకటన నం.17/CE/QQSUDA/2023-24/(2వ పిలుపు), తేది: **27.09.2023**, పని పేరు: PPP పద్దతి క్రింద చార్మినార్ దగ్గర (చార్మినార్-శాలిబండ రోడ్) పాత బస్ స్టాండ్ ప్రాంతం దగ్గర మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ యొక్క నిర్మాణ కొరకు RFP జారీకి ఆసక్తి వ్యక్తీకరణ (2వ పిలుపు). మొత్తం (రూ.కోట్లలో): -, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 30.09.2023 మ.03.30 గం., డౌన్‌లోడ్ ముగింపు తేది: 16.10.2023 సా.04.00 గం., బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 16.10.2023 సా.04.30 గం., బిడ్ తెరుచు తేది: 16.10.2023 సా.05.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ జి. గురువీరా చీఫ్ ఇంజనీర్, QQSUDA దారుల్‌షిఫా, హైదరాబాద్-9989488572.
DIPR.No.7431-PP/CL/Advt/1/2023-24, తేది: 29.09.2023 సం/- చీఫ్ ఇంజనీర్, QQSUDA